వైఎస్ఆర్ కడప
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
బుధవారం 08 ఏప్రిల్ 2026



## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి..

**సుండుపల్లె ,ఏప్రిల్ 07,ప్రభాతవార్త :**
మండల కేంద్రంలోని కూడలిలో ఎస్సై హుస్సేన్ వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారుల పత్రాలను పరిశీలించి, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. అలాగే హెల్మెట్ ధరించడం, అవసరమైన పత్రాలు వెంట తీసుకెళ్లడం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## నంది వాహన సేవలో రామలింగేశ్వర స్వామి

**ప్రొద్దుటూరు అర్బన్, ఏప్రిల్ 7, ప్రభాత వార్త :**
స్థానిక రామేశ్వరం లోని పెన్నా నది తీరాన సాక్షాత్తు శ్రీరామచంద్రునిచే ప్రతిష్టితమైన శ్రీ రాజరాజేశ్వరి దేవి సమేత శ్రీ ముక్తి రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం అభిషేకాలు, హోమం, కలశ పూజ జరిగాయి. సాయంత్రం 6 గంటల నుంచి లలితా సహస్రనామ స్తోత్ర కుంకుమార్చన జరిగింది. అనంతరం రాత్రి 8 గంటల నుంచి స్వామి అమ్మవార్లను నంది వాహనంపై రామేశ్వరం పురవీధుల్లో గ్రామోత్సవము నిర్వహించారు. కార్యక్రమములో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



### ఆర్ఆర్ పరిహార పంపిణీలో

# జాప్యం జరగకూడదు

### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి





**కడప, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :**
జిల్లాలోని అన్ని సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో ఆర్ఆర్ ప్రక్రియలో భాగంగా పరిహార పంపిణీ లేదా పునరావాసం పంపిణీలో ఎలాంటి జాప్యం లేకుండ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత ఇరిగేషన్ ఉన్నతాధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో ఆర్ఆర్ పెండింగ్ పనులపై జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి జేసీ డా. నిధి మీనా, రాజంపేట సబ్ కలెక్టర్ భావన లతో కలిసి ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి డిప్యూటీ కలెక్టర్లు ఆయా ప్రాజెక్టుల పరిధిలో విస్తరణ, అభివృద్ధి పనుల్లో భాగంగా భూ సేకరణ, ఆర్ఆర్ కోసం బడ్జెట్ కేటాయింపు, సంబంధిత అవసరాల నిమిత్తం ప్రణాళికలు చేసుకొని కేటాయింపుల వివరాలను కూడా పొందుపరుస్తూ నివేదికలు అందజేయాలన్నారు. అలాగే భూసేకరణ ప్రక్రియలో భాగంగా అన్ని రకాల రెవెన్యూ, పర్యావరణ అనుమతులతో పాటు కోర్టు కేసు వ్యవహారాలను అధిగమించేందుకు సత్వర చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని అన్ని రకాల సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో 1.30 లక్షల ఎకరాలకు పైగా భూసేకరణ చేయడం జరిగిందన్నారు. సంబంధిత ప్రాజెక్టుల పరిధిలో భూసేకరణ విషయంలో ఏవైనా సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ నేపథ్యంలో భూ రికార్డులను పరిశీలించి ఎక్కడా కూడా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆర్ అండ్ ఆర్ కు సంబంధించి ఇప్పటికే అవార్డు పాస్ అయి పేమెంట్స్ పెండింగ్ ఉన్న గ్రామాలు, పరిహారం లబ్ధిదారుల వివరాల జాబితాను తయారు చేయాలన్నారు. ప్రత్యేకించి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జలాధార కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేస్తూ అన్ని సాగునీటి ప్రాజెక్టుల్లో జలాధార పనితీరు సత్ఫలితాలను ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప, బద్వేలు, పులివెందుల, జమ్మలమడుగు ఆర్డీవోలు మురళి, చంద్రమోహన్, చిన్నయ్య, శిరీష, టిజిపి 2 ఎస్డీసి నాగజ్యోతి, జిఎన్ఎస్ఎస్, ఇరిగేషన్, పీఆర్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్.ఈ. లు చిన్నకొండారెడ్డి, అబూస్ సమీ, మద్దన్న, ఏడుకొండలు, ఆయా ప్రాజెక్టుల పరిధిలోని తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

### 4లక్షల, 30,వేల విలువగల

## 35 గ్రాముల బంగారు స్వాదీనం

### ఆరుగురు ముద్దాయిలు అరెస్టు

**చాపాడు. ఏప్రిల్ 7.ప్రభాతవార్త :**
ప్రొద్దుటూరు నుండి కడపకువెళుతున్న ప్రయాణికురాలుమెడలో నుండిబంగారుగొలుసు అపహరణతో పాటు, మైదుకూరు ఆర్టీసీ బస్టాండ్ నందు మరో ప్రయాణికురాలు బ్యాగులో నుండి రెండు తులాల బంగారు అపహరించిన కేసులో ఆరుగురు ముద్దాయిలను అరెస్టు చేసి వారి వద్ద నుండి చోరు సొత్తు రికవరీ చేసినట్లు మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్, చాపాడు ఎస్సై చిన్న పెద్దయ్యలు తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అరెస్ట్ వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి నెలలో ప్రొద్దుటూరు వై,ఎం,ఆర్, కాలనీకి చెందిన కాకుమాని సరోజ పొద్దుటూరు నుంచి కడపకు ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలో ఉన్న 15 గ్రాముల బంగారు గొలుసు అపహరించి చాపాడువద్ద దిగిపోవడంతోపాటు ఘటనకు సంబంధించి చాపాడుపోలీస్ స్టేషన్ నమోదు అయినట్లు తెలిపారు. అదేవిధంగా మార్చి నెలలో మైదుకూరు ఆర్టీసీ బస్టాండ్ నందు వంగనూరు లక్ష్మమ్మ అనే ప్రయాణికురాలుబ్యాగు నుండి రెండు తులాలబంగారు కూడా దొంగలించినట్లు తేలడంతో మైదుకూరు అర్బన్ స్టేషన్ యందు కేసు నమోదు అయినట్లు తెలిపారు. ఈరెండు ఘటనలకు సంబంధించి తమిళనాడు రాష్ట్రానికి చెందిన ముద్దాయిలు ఎం. విజయ్, కే మారియప్పన్, మణికందన్, లక్ష్మి, మారీశ్వరి, విజయ అను ముద్దాయిలను మంగళవారం అల్లాడుపల్లె దేవలాలు క్రాస్ రోడ్డు వద్ద అదుపులోకి తీసుకొని వరి సొత్తు రికవరీ అనంతరం ముద్దాయిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## పూడ్చిపెట్టిన మృతదేహాన్ని తవ్వి తీసి పోస్టుమార్టం



**కలసపాడు, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:**
మండలం పుల్లారెడ్డి పల్లి గ్రామంలో మంగళవారం ఎంబడి శ్యామల (37) మృతదేహానికి వైద్యాధికారులు పోస్టుమార్టం చేశారు. ఈనెల 3 తేదీ రాత్రి శ్యామల భర్త ఏసయ్య కు గొడవ జరిగింది. అదే రోజు రాత్రి అనుమానాస్పద స్థితిలో శ్యామల మృతి చెందింది. ఆమె మృత దేహాన్ని కుటుంబ సభ్యులు పూడ్చివేశారు. గ్రామస్తుల సహకారంతో ఆమె మృతి పై అనుమానాలు ఉన్నట్లు వీఆర్వో వెంకటసుబ్బమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం సిఐ హేమ సుందర్ రావు, ఎస్సై సుభాన్ యోగేంద్రల ఆధ్వర్యంలో శ్యామల మృతదేహాన్ని బయటకు తీయించి వైద్యాధికారులు పంచనామా చేశారు. మృతురాలి భర్త యేసయ్యను పోలీసుల అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

## వేసవి కాలంలో విద్యుత్ సరఫరాపై ముందస్తు ప్రణాళికలు

### ప్రజలకోసం తప్పనిసరిగా కరెంటోళ్ల జనబాట కార్యక్రమం... ట్రాన్స్కో జిల్లా ఎస్ఇ సోమ శ్రీనివాసులు



డివిజన్ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఇ శ్రీనివాసులు



ఎస్సీ లబ్ధిదారు ఇంటిపైన సోలార్రూఫ్ టాప్ ప్రారంభోత్సవంలో ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు

**రాజంపేట, ఏప్రిల్ 7 ప్రభాతవార్త**
వేసవికాలంలో విద్యుత్ ఎక్కువ అవసరం ఉంటుందని, నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటు ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని ట్రాన్స్కో జిల్లా ఎస్ఇ సోమ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం రాజంపేట విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ సేవల పురోగతి, వేసవి కాలానికి సంబంధించిన ముందస్తు ఏర్పాట్లు, ప్రజలకు అందించే సేవల నాణ్యతపై సమగ్ర సమీక్ష సమావేశం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల విద్యుత్ సమస్యలపై అధికారులు నిరంతరం అందుబాటులో ఉండి, వారు ఎదుర్కొనే విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. వేసవి కాలంలో క్షణం విద్యుత్ నిలిచినా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని, అందువల్ల నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం ముందస్తు చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. ప్రజల ఫిర్యాదులను అధిక ప్రాధాన్యతతో పరిష్కరించాలన్నారు. ఫిర్యాదు పరిష్కార వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. వీధి లైట్లు పగటి పూట వెలగకుండా పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. కరెంటోళ్ల జనబాట కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి, ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా గ్రామాల్లో భద్రతా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో విద్యుత్ భద్రతపై అవగాహన పెంపొందించాలని ఆదేశించారు. ఆర్ డి ఎస్ ఎస్ పథకం క్రింద చేపట్టిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, గ్రామీణ ప్రాంతాలకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు వేగవంతం చేయాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ప్రసన్నాంజనేయులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజశేఖర్ రెడ్డి, డీఈఈలు, ఏఈలు, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, తదితరులు పాల్గొన్నారు. పోలీ ఎస్సీ కాలనీలో సోలార్ రూఫ్‌టాప్ పనుల పరిశీలసమీక్ష అనంతరం ఎస్ ఇ సోమ శ్రీనివాసులు రాజంపేట మండలం పోలీ ఎస్సీ కాలనీలో ఎస్సీ,ఎస్టీ వినియోగదారులకు నెలకు 200 యూనిట్లలోపు వినియోగం ఉన్న కుటుంబాలకు ఉచితంగా అందిస్తున్న సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థల ఏర్పాటు పనులను పరిశీలించారు. పరిశీలన సందర్భంగా ఆయన పనుల పురోగతిని సమీక్షి ంచి, లబ్ధిదారులతో మాట్లాడారు. పేదలకు విద్యుత్‌ను అందించడం, విద్యుత్ బిల్లుల భారం తగ్గించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. తరువాత పోలీ గ్రామంలో గ్రామస్థులతో సమావేశం నిర్వహించి సోలార్ రూఫ్‌టాప్ ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. సోలార్ వ్యవస్థల ద్వారా విద్యుత్ బిల్లులు తగ్గడం, దీర్ఘకాలిక లాభాలు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను వివరించారు. రాజంపేట డివిజన్‌లోని రాజంపేట, నందలూరు, వొంటిమిట్ట, సిద్ధవటం ,సుండుపల్లె , వీరబల్లి మండలాల్లో మొత్తం 4,051 ఎస్సీ/ఎస్టీ సర్వీసులకు 5.82 కోట్లు వ్యయంతో సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థలు ఉచితంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజశేఖర్ రెడ్డి, డీఈఈలు సురేంద్ర, సుబ్రహ్మణ్యం, ఏఈ ఈశ్వర్ రాజు, కాంట్రాక్టర్ రెడ్డయ్య నాయుడు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

### వీధి కుక్కల దాడిలో

# చిరుతపులి పిల్ల మృతి

**దువ్వూరు, ఏప్రిల్ 07, ప్రభాతవార్త:**



మైదుకూరు నియోజకవర్గంలోని దువ్వూరు మండలం చిన్న భాకరాపురం గ్రామంలో మంగళవారం వీధి కుక్కల దాడిలో చిరుత పులి పిల్ల మృతి చెందినట్లు గ్రామస్థులు గుర్తించారు. వివరాలు ఇలా ఉన్నాయి... మండలంలోని చిన్న భాకరాపురం గ్రామ పొలాలలో కొంతమంది రైతులు పసుపును ఉడికించి ఎండలో వేసుకొని ఉన్నారు. సోమవారం రాత్రి 9 గంటల వరకు రైతులు అక్కడే ఉండి ఇళ్లకు వెళ్లిపోయారు. సుమారు 11 గంటల ప్రాంతంలో గ్రామంలోని కుక్కలు ఎక్కువగా అరుపులు వేశాయని అయితే అవి ఎందుకు వేస్తున్నాయో గమనించలేదని తెలిపారు. వీధి చివర ఎవరైనా కొత్త మనుషులు వచ్చారేమో అని పరిశీలించామని ఎవరు లేనట్టు తెలుసుకొని వెళ్ళిపోయామన్నారు. అనంతరం ఉదయం ఆ ప్రాంతంలో ఉన్న రైతులు పొలాల వద్దకు వెళ్లగా సమీపంలో చిరుతపులి పిల్ల మరణించి ఉండటంపై గమనించారు. ఈ విషయాన్ని ఫారెస్ట్ అధికారులకు ఫోన్ ద్వారా తెలియజేశారు. ఈ విషయం తెలుసుకున్న వనిపెంట డిఆర్ఓ అన్వర్ హుస్సేన్, బీట్ ఆఫీసర్ సుచరిత, సిబ్బంది కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. చిరుత పులి పిల్ల ఏ విధంగా మరణించింది అనే వివరాలను రైతులతోనూ, గ్రామస్తులతోనూ ఆరా తీశారు. భక్త ప్రకాల ప్రదేశాలను కూడా గమనించారు. ఎక్కడైనా విద్యుత్ తీగలు ఏమైనా ఉన్నాయా లేక ఇతర సంఘటనలు ఏమైనా జరిగాయా అని తనిఖీ చేశారు. అనంతరం చిరుత పులి పిల్ల మృతదేహాన్ని పరిశీలించి గొంతు వద్ద ఎక్కువగా కాట్లు ఉండటంతో వీధి కుక్కలే దాడి చేసి ఉంటాయని భావించారు. చిరుత పులి పిల్లను పోస్టుమార్టం నిమిత్తం దువ్వూరు పశు వైద్యశాలకు తరలించారు. అక్కడ పశు వైద్యాధికారి డాక్టర్ ఫణింద్ర రెడ్డి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం వనిపెంట ఫారెస్ట్ అధికారి అన్వర్ హుస్సేన్ మాట్లాడుతూ చిరుత పులి పిల్లను వీధి కుక్కలు గాని, అడవి కుక్కలు కానీ దాడి చేసి ఉంటాయని భావిస్తున్నామని అయితే చివరగా పోస్ట్ మార్టం నివేదిక అలాగే ల్యాబ్ పరీక్ష నివేదిక వచ్చిన తర్వాతే విచారణ చేస్తామన్నారు. ఈ ప్రాంతంలో ఇది ఒకటేనా ఇంకా ఏమైనా ఉంటాయా అని పరిశీలిస్తామని తెలిపారు. మృతి చెందిన చిరుత పులి పిల్ల వయస్సు సుమారు 1 సంవత్సరం పైగా ఉంటుందని తెలిపారు. ఈ సంఘటనపై ఫారెస్ట్ అధికారులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఒక 50, 60 సంవత్సరాలుగా దువ్వూరు మండలంలో చిరుతపులో కనబడలేదని ఇదే మొట్ట మొదటిసారి అని గ్రామస్తులు తెలిపారు. చనిపోయిన చిరుత పులి పిల్లను చూసేందుకు ఎక్కువ సంఖ్యలో ప్రజలు గుమి కూడారు. ఈ చిరుత పులి పిల్ల ఒకటేనా ఇంకా ఏమైనా ఉన్నాయా అనే విషయాన్ని అటవీ శాఖ అధికారులు గుర్తిస్తామని తెలిపారు.

## గంజాయి స్వాధీనం ఇద్దరు ఆరెస్టు

**బద్వేలు, ఏప్రిల్, ప్రభాతవార్త :**
మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లె, యానాది కాలనీ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు అర్బన్ సీఐ రావ కృష్ణ తెలిపారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు చెన్నంపల్లె, యానాది కాలనీ సమీపం, కాశినాయన ఆలయం వద్ద తనిఖీలు చేపట్టారు. ఈమేరకు అనుమానాస్పదంగా క కనిపిస్తున్న దిక్కుల తిరుమలేసు, ఆదిబోయిన శ్రీనివాసులు అనే ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద 2కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీని విలువ సుమారు రూ.30వేలు ఉంటుందని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయించడం తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## వేంపల్లిలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం..

**వేంపల్లె ఏప్రిల్ 07 (ప్రభాత వార్త)**
ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తాళ్లపల్లి వైద్య అధికారి డాక్టర్ శాంతి డాక్టర్ పృధ్వి కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహించడం జరిగింది ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా వైద్య అధికారులు ప్రసంగిస్తూ శరీరం ఒక దేవాలయం దానిని పరిశుభ్రంగా ఆరోగ్యంగా ఉంచుకోవడం మన కనీస బాధ్యతని వివరించారు ప్రతి మనిషి యోగా దానం ప్రాణాయమం నడక మొదలగునవి చేయవలసిందిగా వివరించారు ముఖ్యంగా ప్రతి మనిషి ఆహారపు అలవాట్లు మంచిగా చేసుకోవాలని వివరించారు ఈ కార్యక్రమంలో జి. వెంకట రత్నం, సి హెచ్ ఓ రెడ్డి కుమారి, హెచ్ఇ అరుణాదేవి, కే అంకయ్య, ఎంపిహెచ్ఎస్సి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



### రాష్ట్రాన్ని గంజాయి,

## మురికి ఆంధ్ర ప్రదేశ్ గా చేయకండి..

**వేంపల్లె ఏప్రిల్ 07 (ప్రభాత వార్త)**



రాష్ట్రాన్ని గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా, మురికి ఆంధ్రప్రదేశ్‌గా చేయవద్దని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి సూచించారు. మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఒకవైపు ముఖ్యమంత్రి గారేమో స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర, సంపద ఆంధ్ర, సంతోష ఆంధ్ర అంటూ రోజూ పాట పాడుతున్నారు . మరొక వైపేమో రాష్ట్రం మద్య ఆంధ్ర, జూదాంధ్ర, గంజాయ్ ఆంధ్ర, డ్రగ్గాంధ్ర, మురికాంధ్ర, బూతుల ఆంధ్ర, దరిద్రపు ఆంధ్రగా తయారవుతోందని తులసి రెడ్డి ఎద్దేవా చేశారు. మండలానికి నాలుగు మద్యం షాపులు, 40 బెల్ట్ షాపులుగా మద్యం పాలసీ తయారైంది. మద్యం విచ్చలవిడిగా దొరుకుతోంది .ఏరులై పారుతోంది. ఇంటికి ఒక పారిశ్రామికవేత్త దేవుడెరుగు. ఇంటికొక తాగుబోతు తయారవుతున్నాడు. మద్యానికి బానిసలైన మహిళల సంఖ్య రోజురోజుకు పెరుగు తోంది. మూడు జోకర్లు, ఆరు కళావరులుగా జూదం సాగుతోంది . హై స్కూల్ విద్యార్థుల్లో కూడా డ్రగ్స్, గంజాయి దుష్ట సంస్కృతి రోజురోజుకు ఎక్కువవుతోంది. కడపకు చెందిన గంజాయి బ్యాచ్ కడప శివారులోని అలంకానిపల్లికి చెందిన పెద్ద దస్తగిరిని కడప రిమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలో కత్తులతో పొడిచి సోమవారం తెల్లవారుజామున దారుణంగా చంపారు. రాష్ట్రంలో పారిశుధ్యం పడకేసింది. మురుగు కాలువలు పూడిపోయాయి. నెలలో ప్రతి మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వం మొక్కుబడిగా, తూతూ మంత్రంగా చేస్తోంది. ఈరోజు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం. 1950 సంవత్సరం నుంచి ఏప్రిల్ ఏడవ తేదీని ప్రపంచ ఆరోగ్య దినోత్సవంగా ఐక్యరాజ్యసమితికి చెందిన ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. మనుషులు, మొక్కలు, జంతువులు, భూగోళం ఆరోగ్య రక్షణ కోసం కలిసికట్టుగా కృషి చేద్దామని, విజ్ఞానానికి అండగా నిలబడదా మని ప్రపంచ ఆరోగ్య సంస్థ 2026 సందేశాన్ని ఇచ్చింది. ఒకవైపు పారిశుధ్యం పడకేసిన కారణంగా అంటువ్యాలు విజృంభిస్తూ ఉంటే మరొకవైపు ప్రభుత్వం ఆరోగ్య శ్రీ బకాయిలు చెల్లించని కారణంగా నెట్వర్క్ హాస్పిటల్స్ ఆరోగ్యశ్రీ సేవలు బంద్ చేసిన కారణంగా అనేకమంది మృత్యువాత పడుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మాటలు కట్టిపెట్టి రాష్ట్రములో గంజాయి, డ్రగ్స్ అరికట్టేందుకు, పారిశుద్ధం మెరుగుపరిచేటందుకు కృషి చేయాలని ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించి సేవలు వెంటనే పునరుద్ధరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## రసాయనాలు లేని పండ్లు,
## ఆకుకూరలతో మంచి ఆరోగ్యం




తొండూరు ఏప్రిల్ 7 ప్రభాతవార్త:
ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తొండూరు యందు డాక్టర్ సుభాషిణి ఆధ్వర్యం లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ర్యాలీ సిబ్బంది ద్వారా చేశారు, ఈ సందర్భం గా విజ్ఞానానికి అండగా నిలుద్దాం, అపోహలు మూడ నమ్మకాలు,అంధ విశ్వా సం వీడి శాస్త్ర విజ్ఞానం ద్వారా, ప్రజలు, ఆరోగ్య సిబ్బంది, ప్రభుత్వాలు కలిసి సమష్టిగా కలిసి ఆరోగ్యాన్ని సాధించగలని తెలిపారు. రసాయనాలు లేని ఆ హారం, చౌకగా లభించే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు. వ్యాయామం, మంచి ఆరోగ్య అలవాట్లు, కలుషితం లేని గాలి, నీరు, ఆహారం తీసుకోవడం ద్వారా వ్యక్తి గత, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యము సా ధ్యమని తెలిపారు. దీనికొరకు అవగాహన కార్యక్రమాలు నిర్వంచాలని, ప్రజల భాగస్వామ్యం పెంచాలని కోరారు. మన ఆరోగ్యం మన హక్కు, నీ ఆరోగ్యం నీ చేతుల్లోనే, జీవన శైలిని మార్చుకో, ఆరోగ్యాన్ని పెంపొందించుకో లాంటి ని నాదాల ద్వారా ర్యాలీ నిర్వహించారు. తదుపరి ఆశాడే కార్యక్రమము నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గవాస్కర్‌రెడ్డి, డాక్టర్ నజీదా, కమ్యూనిటీ ఆ రోగ్య అధికారిని విజయ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి మల్లయ్య, స మాజ ఆరోగ్య అధికారిణిలు సోమేశ్వరి, ప్రసన్న, శిరీష, లాబ్ టెక్నీషియన్ కు మారి, ఫార్మసీ అధికారి మోహన్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుల వివాదాలపై నిజ నిర్ధారణ కమిటీ హెచ్చరిక




ఎడ్యుకేషన్ ఏప్రిల్ 7 ప్రభాతవార్త :
కులం, మతం పేరుతో నగరంలో వివాదాలు సృష్టించడం సహించబోమని నిజ నిర్ధారణ కమిటీ కన్వీనర్ సిఆర్వి ప్రసాద్ రావు హెచ్చరించారు. మం గళవారం కడప ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. ఇళ్ల స్థలాల కొనుగోలు, అమ్మకాల విషయంలో కొందరు కులాన్ని అడ్డుపెట్టి సమస్యలు సృష్టిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే అమ్మిన ఆస్తులపై తిరిగి హక్కులు కో రడం అన్యాయమన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపిన తర్వాత అమ్మిన వా రికి హక్కులు లేవని కమిటీ తేల్చిందని తెలిపారు. దళితుల పేరుతో అనవసర వివాదాలు సృష్టించడం బాధాకరమని, నిజంగా అన్యాయం జరిగితే చట్టాలు ఉన్నాయన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలపై బాధితుల పక్షాన నిలబడ తామని కమిటీ స్పష్టం చేసింది.

## ప్రపంచ ఆరోగ్య దినోత్సవం అవగాహన



సిద్ధవటం, ఏప్రిల్ 7 ప్రభాతవార్త
యువత తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని మలేరియా సబ్ యూని ట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు తెలిపారు మండల కేంద్రమైన సిద్ధవటం బ్రా హ్మణ వీధిలో పి కొత్తపల్లి ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ రంగలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ ఆరోగ్య దినం సందర్భంగా అవగాహన కా ర్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని పౌష్టికాహారం తీసుకోవాలని తద్వారా ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కా పాడుకోవచ్చని యువత ధూమపానం మద్యపానం, దూర అలవాట్లకు దూ రంగా ఉండాలని పరిసరాల శుభ్రత ఆరోగ్య భద్రత తప్పకుండా పాటించాలని గర్భవతులు వృద్ధులు బాలింతలు అధిక ఉష్ణోగ్రతల వల్ల జాగ్రత్త వహించాలని వడదెబ్బ నివారణ కొరకై మజ్జిగ మంచినీరు, ద్రవ పదార్థాలు తప్పనిసరిగా తీసుకొని ఆరోగ్యం పట్ల జాగ్రత్త తీసుకోవాలని పలు సూచనలు సలహాలు అం దించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ మోలాలి, హెల్త్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య, ఆరోగ్య కార్యకర్తలు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## పేద విద్యార్థుల కలల సహకారమే
## అటల్ టింకరింగ్ ల్యాబ్



లక్కిరెడ్డిపల్లి మార్చి 07 ప్రభాత వార్త
పేద విద్యార్థుల కలల సహకార కోసమే ప్రధానమంత్రి మోడీ ప్రభుత్వ పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్లు ఏర్పాటు చేశారని డి ఆర్ పి షేక్ షర్ఫుద్దీన్ పేర్కొన్నారు సర్వ శిక్ష అభియాన్ వారి ఆధ్వర్యంలో మంగళవారం ఏపీ మోడల్ స్కూల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్ నందు విద్యార్థులకు బూట్ స్కిల్ డెవలప్మెంట్ పై విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న యుగంలో పేద విద్యార్థులకు బూట్ అటల్ టింకరింగ్ ల్యాబ్లు ఏర్పాటు చేసి ఎంతోమందిని పేద విద్యార్థులను గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు కేంద్ర ప్రభుత్వం అటల్ టింకరింగ్ ల్యాబ్ లు ఏర్పాటు చేసిందన్నారు చివరి రోజున విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

## నేడు గాలివీడు సంతల వేలం పాట

గాలివీడు.. ఏప్రిల్ 7. ప్రభాతవార్త.
నేడు 8 వ తేదీన గాలివీడు సంతల బహిరంగ వేలంపాటను నిర్వహిస్తున్నట్లు గాలివీడు పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నా రు. బుధవారం జరిగే కూరగాయల సంత, గురువారం జరిగే మూగజీవాలసంత, బస్టాండ్ రుసుములకు వేలంపాట నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొన దలుచువారు గ్రామపంచాయతీకి ఎలాంటి బకాయిలు ఉండరాదని పేర్కొ న్నారు. ఈ వేలం పాటలు పాల్గొన్న వారు ప్రతి ఒక్కరు ఒక లక్ష యాభై వేలు డిపాజిట్ చేసి పాల్గొనాలని తెలిపారు.

### పేదలపై కఠిన చర్యలు...
## పెద్దలపై మౌనం?

68 లక్షల బకాయిలున్న టెక్మెల్స్‌కు నో నోటీస్
పేదల ఇళ్లకు మాత్రం తాళాలు
మున్సిపల్ అధికారులపై సిపిఐ ఆగ్రహం

పులివెందుల, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

పన్ను వసూళ్లలో మున్సిప ల్ అధికారులు వివక్ష చూపు తున్నారంటూ సిపిఐ ఆధ్వ ర్యంలో పులివెందులలో నిరస న కార్యక్రమం నిర్వహిం చా రు. మున్సిపల్ ప్రత్యేక పాల నాధికారి కార్యాలయం వద్ద మంగళవారం చేపట్టిన నిరస న అనంతరం అధికారులకు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సిపిఐ పులివెందుల ఏరియా కా ర్యదర్శి వెంకట రాములు మాట్లాడుతూ, లక్షల రూపాయల పన్ను బకాయిలు ఉన్న పెద్ద సంస్థలపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫల మయ్యారని ఆరోపించారు. టెక్మెల్స్ సంస్థపై సుమారు ..68 లక్షల బకా యిలు ఉన్నప్పటికీ ఇప్పటివరకు కనీస నోటీసు కూడా ఇవ్వలేదని విమర్శిం చారు. అదేవిధంగా ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూట్స్ వంటి పలు సంస్థలు కూడా భారీగా పన్నులు బకాయి ఉన్నప్పటికీ వాటి వైపు అధికారులు దృష్టి సారించ డం లేదన్నారు. కానీ పేద ప్రజలు పన్ను చెల్లించడానికి గడువు అడిగితే కఠిన చర్యలు తీసుకుంటూ ఇళ్లకు తాళాలు వేయడం, నీటి కనెక్షన్లు కట్ చేయడం వంటి చర్యలు తీసుకుంటున్నారని మండిపడ్డారు.పేదలపై ఒత్తిడి పెంచుతూ, పెద్దలపై మౌనం పాటించడం సరైన విధానం కాదని, ఇది అన్యాయమని పేర్కొన్నారు. తక్షణమే పెద్ద మొత్తంలో పన్ను బకాయిలు ఉన్న సంస్థలకు నో టీసులు జారీ చేసి, బకాయిలను వసూలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ వేముల మండల కార్యదర్శి చాంద్ భాష, పట్టణ నాయకులు సుభాన్ భాష, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## కార్యాలయంపై దాడి దుర్మార్గం

పులివెందుల, ఏప్రిల్ 7, ప్రభాత వార్త :



హైదరాబాద్‌లోని మీడియా కార్యా లయంపై జరిగిన దాడిని పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి ఖండిం చారు. మంగళవారం ఈ ఘటనపై స్పందించిన బిటెక్ రవి స్వయంగా కార్యాలయాన్ని సందర్శించి అక్కడ జ రిగిన విధ్వంసాన్ని పరిశీలించారు. అ నంతరం సంస్థ యాజమా న్యం మరి యు సిబ్బందితో మాట్లాడి సంఘట నకు సంబంధించిన వివరాలను తెలు సుకున్నారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ, ప్రజాస్వా మ్యంలో పత్రికలు మరియు ప్రసార మాధ్యమాలపై దాడులు జరగడం అత్యంత హేయ మైన చర్య అని మండిపడ్డారు. నిజాలను ప్రజల ముందుకు తీసుకువ స్తున్న మీడియా గొంతు నొక్కేందుకు ప్రయత్నిం చడం దుర్మార్గమని ఆయన పేర్కొ న్నారు. పత్రికా స్వేచ్ఛపై జరిగిన ఈ దాడిని ప్రభుత్వం అత్యంత గంభీరంగా పరిగణించాల్సిన అవసరం ఉందని, దాడికి పాల్పడిన వారిని వెంటనే గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సం దర్భంగా మీడియా యాజమాన్యానికి, అలాగే విధుల్లో ఉన్న సిబ్బందికి ఆయన తన సంఘీభావాన్ని తెలియజేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరా వృతం కాకుండా ప్రభుత్వం తగిన భద్రత చర్యలు చేపట్టాలని, మీడియా స్వేచ్ఛను కాపాడటం అందరి బాధ్యత అని స్పష్టం చేశారు.

## రుపాయి నోటు అబ్బో భలే ఉందే
### 2, 1, 5రుపాయల నోట్లు అరుదే







నిమ్మనపల్లె, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :
రుపాయి నోటా..అబ్బో భలే ఉందే. చూడడానికే ఇది. చెలామణికి ఇస్తే ఆలోచనలో పడుతున్నారు. మారుతా య...లేదా...చివరకి పడేయాలా అన్న మాట ఎలా ఉన్నా. ఇదేబాటలో రూ. 2, 5నోట్లు కూడా కాలం చెల్లిందా అంటే లేదు.. నిమ్మనపల్లె మండలంలో మాత్రం ఈనోట్లు తీసుకెలితే ఆశ్యర్యంగా చూస్తున్నారు. అవి చెలామణిలో ఉన్నాయో లేదా..అంటూ కానీ అనధికారికంగా మాత్రం వ్యాపారస్థులు వీటిని చెల్లవంటూ కొందరు వెనక్కి ఇస్తున్నారు. రుపాయి...ఐదు రుపా యలు..రెండు రుపాయలు..నోట్లు ఎంత కొత్తగా ఉన్నా చూడడానికే తప్పా మార్పిడి పనికిరావంటున్నారు. దీన్ని బట్టీ చూస్తే వీటికి కాలం చెల్లిందా అ న్ని అనుమానం వస్తొంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్పిడి చేయరాదని చెప్పకపోయినా వ్యాపారులు ఇలా పుకార్లు చేస్తున్నారు. ఒకటి, రెండు, మూడు, ఐదు, ఇరవై, ఇరవై ఐదు పైసాలను నిషేధించింది. అయితే ఒకరుపాయి, రెండు రుపాయలు కాయిన్స్ చెందుతాయి. అదే ఒకటి, రెం డు, ఐదు రూపాయల నోట్లు చెల్ల వట ఇదేమి విడ్డూరమంటూ వినియోగదారులు అంటున్నారు. వీటిని సంతకు, బజారుకు, చిల్లరకొట్టుకు, టీ దుకా ణంకు, కండెక్టర్‌కు ఇచ్చినా అనుమానంగా తీసుకోవడం, తీసుకోకపోవడం చేస్తున్నారు.అయితే వ్యాపారస్థులు మాత్రం ఈ నోట్లను తీసుకోకుండా వీటిని స్థానంలో ఉన్న నాణ్యాలను మాత్రం తీసుకుంటున్నారు. ఈ నోట్లను ఏం చే యాలని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఇవి చెలామణిలో ఉన్నాయా.. లేదా.. అధికారికంగా ప్రకటిస్తే బాగుండునని తెలిపారు

### మండల కేంద్రంలోని స్వర్ణ గ్రామకార్యాలయాన్ని ఆకస్మిక తనికీ చేసిన ఎంపిడిఓ 1అన్నపూర్ణ



రామసముద్రం మార్చి 7 ప్రభాతవార్త
మండలంలోని స్వర్ణ గ్రామ కార్యాలయాన్ని మంగళవారం మండల మం డల పరిషత్ అభివృద్ధి అధికారి అన్నపూర్ణ ఆకస్మిక తనిఖీ చేసారు. తనిఖీలో భాగంగా స్వర్ణ గ్రామ సిబ్బంది హాజరును పరిశీలించినారు. అలాగే ప్రభుత్వం ద్వారా నిర్వహించే వివిధ రకాల సర్వేల ప్రగతిని సిబ్బందితో సమీక్షించారు. ఆమె పంచాయతీ కార్యదర్శి మునిస్వామినాయక్ సిబ్బంది తో మాట్లాడుతూ గ్రామపంచాయతీలో పన్నుల పాత బకాయిలు ఉంటే తక్షణమే వసూళ్లు చేయాలని పంచాయతీ అధికారులకు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నా ఎంపిడిఓ 1అన్నపూర్ణ పంచాయతీ కార్యదర్శి మునిస్వామి నాయక్,స్వర్ణ గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.

## డి.ఎడ్ కోర్సులో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానం

### ప్రవేశాల పోస్టర్లను ఆవిష్కరించిన డైట్ ప్రిన్సిపల్ డాక్టర్ కె. సుబ్రహ్మణ్యం



రాయచోటి ఏప్రిల్ 7 ప్రభాతవార్త:
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2026-2027 విద్యా సంవత్సరానికి గాను డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీ.న్డి.న్టి) కోర్సులో ప్రవేశాల కోసం నిర్వహించబడే దీనినిదినిగి2026 పరీక్షకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైట్ ప్రిన్సిపల్ డాక్టర్ కె. సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం ఉదయం రాయచోటి పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో డి. ఎడ్ ప్రవేశాల కోసం రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ: ప్రభుత్వ డిస్ట్రిక్ట్ ఇన్స్టిట్యూట్స్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (దీనిగ్బి) మరియు ప్రైవేట్ ఎలిమెంటరీ టీచర్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూషన్స్‌లో అందిస్తున్న రెండు సంవత్సరాల కోర్సులో ప్రవేశం కోసం అభ్యర్థులు కేవలం ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి నోటిఫికేషన్, అర్హత ప్రమాణాలు, మరియు ఆన్‌లైన్ దరఖాస్తు విధానం సంబంధించిన వివరాలు https://cse.ap.gov.in మరియు https://apdeecet.apcfss.in వెబ్‌సైట్లలో 31032026 నుండి అందుబాటులో ఉన్నాయని తెలిపారు. దరఖాస్తులు సమర్పించుటకు చివరి తేదీ ఏప్రిల్ 15 వ తేదివరకు ఉంటుందన్నారు. ఇతర వివరాల కోసం డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డిని ఈ సెల్ నెంబర్ 9440246825 ద్వారా సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఉప విద్యాశాఖ అధికారి నాగయ్య, జిల్లా ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ కొండూరు శ్రీనివాసరాజు, డైట్ ఇన్చార్జి ప్రిన్సిపల్ మడి తాటి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిత్వ నిర్మాణానికి చదువే మూలం

### ఆదిత్య హాస్పిటల్ వైద్యులు భాస్కర్ రెడ్డి



గాలివీడు. ఏప్రిల్ 7. ప్రభాతవార్త.
వ్యక్తిత్వ నిర్మాణానికి చదువే మూలమని ఆదిత్య హాస్పిటల్ వైద్యులు భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు.మంగళవారం మండల కేంద్రం లోని శ్రీ రవిచంద్ర సీబీఎస్ఈ స్కూల్ నందు ప్రైమరీ మరియు ప్రీ ప్రైమరీ తరగతులకు కాన్వకేషన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆదిత్య హాస్పిటల్ వైద్యులు భాస్కర్ రెడ్డి హాజరు అయ్యారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కూడా ఇదే పాఠశాలలో విద్యను అభ్యసించి స్వంత గ్రామంలో వైద్యునిగా సేవలు అందించడం ఆనందంగా ఉందని తెలిపారు. కావున విద్యార్థిని విద్యార్థులు సమాజంలో వ్యక్తులుగా మారినప్పుడు వారి యొక్క వ్యక్తి నిర్మాణానికి మరియు వ్యక్తిత్వ నిర్మాణానికి చదువు ప్రధాన కారణమని ఆయన తెలిపారు. పిల్లలు ఇప్పటి నుండే చక్కటి క్రమశిక్షణ గల విద్యను అభ్యసించడం వలన అదే సాధ్యపడుతుందని ఆయన తెలిపారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థిని విద్యార్థులు ఆసక్తులను గుర్తించి తదనగుణంగా వారిని ప్రోత్సహించడం ద్వారా ఇది మరింత వేగంగా సాధ్యపడుతుందని ఆయన తెలిపారు .ఈ కార్యక్రమంలో యాజమాన్యం సైజు థామస్ , షింటో ఇమ్మానెయుల్, ప్రిన్సిపల్ లిజాజాయ్, వైస్ ప్రిన్సిపల్ గరడప్ప, కోఆర్డినేటర్ విజయ భాస్కర్ రెడ్డి మరియు అధ్యాపక బృందం తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## లక్కిరెడ్డిపల్లి ఆర్టీసీ బస్టాండును వెంటనే ప్రారంభించాలి



లక్కిరెడ్డిపల్లి మార్చి 07 ప్రభాతవార్త
లక్కిరెడ్డిపల్లిలోని ఆర్టీసీ బస్టాండు 40 లక్షల రూపాయలతో పూర్తిచేసి ప్రారంభించకుండా నిరుపయోగంగా వదిలేశారని బస్టాండ్ వెంటనే ప్రారంభించాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగల శ్రీనివాసులు పేర్కొన్నారు ప్రజల సౌకర్యం కోసం నిర్మించిన బస్టాండ్ ను ఉద్దేశపూర్వకంగా వాడుకలోకి తీసుకురాకపోవడం చాలా బాధాకరమన్నారు ఆర్టీసీ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ ప్రజల సొమ్ముతో నిర్మించిన భవనాలను నిరుపయోగ వదిలేయడం బాధ్యత బాధ్యత రాహిత్యానికి దానికి నిదర్శనం అన్నారు ఆర్టీసీ అధికారులు కేవలం పేపర్ల పై పనులు పూర్తయ్యాయని చూపించి ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు ప్రయాణికులకు రోడ్డుపక్కనే ఎండలో వర్షంలో బస్సుల కోసం గంటలు తరబడి నిలిచి ఉన్నారని ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యం ధోరణి వదిలి ఆర్టీసీ బస్సులను బస్టాండ్ కు మళ్లింపు చేసి ప్రయాణికులను బస్టాండ్ వచ్చేటట్టు చూడాలన్నారు అలాగే మరుగుదొడ్లు త్రాగునీరు వసతులు కల్పించాలని వారు ఆర్టిసి అధికారులు కోరారు పార్టీ అధికారంలో స్పందించకపోతే అవసరమైతే రోడ్డు రాస్తాలు ధర్నాలు చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో మండల సిపిఐ నాయకులు కొమ్ము ఓబులేసు ఆంజనేయులు జగన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

### పారిశుద్ధ్యం పట్ల అప్రమత్తంగా వుండాలి : గఫూర్



సమీక్షా సమావేశంలో గఫూర్

చౌడేపల్లి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త
గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం పట్ల అప్రమత్తంగా వుండాలని డిఎంపి డిఓ ఎస్.ఎ.గఫూర్ అన్నారు. మండలంలోని ఆమినిగుంట స్వర్ణగ్రామంలో అధికారులకు పారిశుద్ధ్యంపై సూచనలిచ్చారు. ప్రతి రోజూ గ్రీన్ అంబాసిడర్లు ఇంటింటికీ వెళ్ళి తడి, పొడిచెత్తలను క్రమం తప్పకుండా సేకరించాలన్నారు. ముఖ్యంగా ఐవిఆర్ఎస్‌ల పట్ల అవగాహన కల్పించారు. అనంతరం పందిళ్ళ పల్లి, ఆమినిగుంట పంచాయతీల్లోని గ్రామాల వారీగా పలు కార్యక్రమాలపై సమీక్షించారు. పిడిఓలు అమరనాథ్, మోహన్, స్వర్ణగ్రామ సిబ్బంది పాల్గొన్నారు.

### తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి షరీప్ సేవలు బేష్

టిడిపి సీనియర్ నాయకులు ఎస్.ఎ.మస్తాన్



మదనపల్లె, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :
తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి గత 40ఏళ్ళుగా ఎం.ఎ.షరీప్ నిస్వార్థ సేవకునిగా, క్రియాశీలకంగా పనిచేస్తున్నారని టిడిపి సీనియర్ నాయ కులు ఎస్.ఎ.మస్తాన్ కొనియాడారు. మంగళవారం స్థానిక విలేకర్లతో ఎస్.ఎ.మస్తాన్ మాట్లాడుతూ 2014లో టిడిపి అధికారంలోకి తరు వాత శాసనమండలి సభ్యునిగా ఎన్నికై ఛైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టా రని, శాసనమండలి ఛైర్మెన్ నాటి నుంచి ప్రతిపక్షంలోని వైసిపి పెట్టిన ఇబ్బందులకు దీటుగా సమాదనం చెప్పారన్నారు. ఎన్నో అవమానాలు చేశారు. కులంపేరుతో దూషనలు అయినా వాటిని ఎదుర్కొని పార్టీకి సమర్థవంతగా పనిచేసిన ఏకైక వ్యక్తి ఎం.ఎ.షరీప్ అన్నారు. అమరావతి రాజధానిగా ఏర్పాటు కావడం చారిత్రక ఘట్టమని ఎస్.ఎ.మస్తాన్ తెలి పారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### మందకృష్ణ చేసిన వ్యాఖ్యలు సమంజసమే




మదనపల్లెక్రైమ్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త.
సుప్రీంకోర్టు తీర్పుపై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ చేసిన వ్యాఖ్యలు సమంజసమేనంటూ భారతీయ అంబేద్కర్ సేన(బాస్) వ్యవస్థాపకులు పీటీఎం శివప్రసాద్ అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావే శంలో ఆయన మాట్లాడుతూ క్రైస్తవ, ఇస్లాం మతాల్లోకి మారిన షెడ్యూల్డ్ కుల వారికి ఎస్సీ. ఎస్టీ యాక్ట్ వర్తించదంటూ ఇటీవల సుప్రీం ఇచ్చిన తీర్పును నిరసిస్తూ మందకృష్ణ వ్యాఖ్యలు సమంజసమేనన్నారు. ఇందులో బ్రాహ్మణ సంఘాల నేతలు జోక్యం చేసుకుని అవగాహన లేకుండా మాట్లాడారని తగదన్నారు. మందకృష్ణపై అవాకులు పేలితే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. క్రైస్తవంలోకి మారిన బ్రాహ్మణ, రెడ్డి, కమ్మ, కాపు, బీసీ, ఎస్టీ కులాల వారికి అదే కులం వర్తిస్తున్నప్పుడు, ఎస్సీలకు మాత్రమే ఎందుకు వర్తించదని ప్రశ్నించారు. అగ్రవర్ణాల దౌర్జన్యం వల్లే దళితులు క్రైస్తవంలోకి మారుతున్నారన్నారు. క్రైస్తవంలో కులవివక్ష ఉన్నంతకాలం దళితులను ఎస్సీ హోదాలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేకుంటే దేశ వ్యాప్త ఉద్యమం తప్పదన్నారు. ఈ కార్యక్రంలో బాస్ నాయకులు నీరుగట్టి రమణ, చాట్ల బయన్న గంపల రమణ దేగాని రమణ, సాన్నికంటి రెడ్డెప్ప, గంగాధర్, నరసింహులు, చిన్నా, మనోహర్రెడ్డి, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతికత పై ప్రత్యేక అనుభవాన్ని కల్పించడమే అటల్ బూట్ క్యాంపులు




పెద్దమండెం ఏప్రిల్ 7 ప్రభాతవార్త
సాంకేతికతపై ప్రత్యక్ష అనుభవాన్ని కల్పించడమే అటల్ బూట్ క్యాంపులు చేపట్టినట్లు జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి అన్నారు మంగళవారం కల్చర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అటల్ బూట్ క్యాంపులను ఆయన సందర్శించారు సమగ్ర శిక్షణ సహకారంలో 24 గంటలు అటల్ టింకరింగ్ ల్యాబ్ విద్యార్థులకు ప్రత్యక్షంగా అనుభవాన్ని పెంపొందించడం జరుగుతుందన్నారు విద్యార్థుల్లో ఆవిష్కరణ సృజనాత్మకత పెంపొందించడం డిజైన్ థింగ్స్ ప్రోటో టైపింగ్ నైపుణ్యాలను అభివృద్ధి చేయడం యువతకు భవిష్యత్తులో ఆవిష్కరణ కర్తలకు పారిశ్రామికవేత్తలుగా నిపుణులు మార్గదర్శకాలు పర్యవేక్షణలో విద్యార్థులు ప్రాజెక్ట్ చేయడం మూడు రోజులపాటు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలించడం జరిగిందన్నారు. విద్యార్థులకు సైన్స్ పట్ల అవగాహన అటల్ బోర్డ్ క్యాంపు లపై సమగ్ర అధ్యయనం జరిపించడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మీనా నాగలక్ష్మి అటల్ ఇంచార్జ్ టీచర్ హేమంత్ కుమార్ ట్రైనర్ యోగేష్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# చౌడేపల్లి నడివీధి గంగమ్మ జాతర...!

## అమ్మవారి వివాహానికి తరలిన భక్తజనం



చౌడేపల్లి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త

యేటా ప్రతిష్టాత్మకంగా జరిగే నడివీధి గంగమ్మ జాతర మంగళవారం కోలాహలంగా ప్రారంభమైంది. రెండు రోజులపాటు జరుగు జాతరలో పలు కార్యక్రమాలను నిర్వహించారు. తొలిరోజున నిర్వాహకుల్లో ఒకరైన కడియాల మహేష్‌బాబు గంపతీసుకొని గ్రామదేవతలకు పూజలు చేసారు. అనంతరం పెద్దలు, బ్రాహ్మణ మహిళలతో పిడిదీపాలతో చౌడేశ్వరీదేవి ఆలయంలోకి వెళ్ళి అక్కడ అమ్మవారికి చెల్లించారు. దీంతో జాతర మొదలైంది. కుమ్మరివీధిలోని కళ్యాణ గంగమ్మ వద్ద గంగమ్మను నెలకొల్పి విశేష పూజలు చేసారు. అక్కడి నుంచి సాంస్కృతిక కార్యక్రమాల మధ్య నడివీధి గంగమ్మను ఊరేగించారు. అనంతరం స్థానిక చాకలివీధిలోకి అమ్మవారిని తీసుకొచ్చారు. ఇక్కడ రాష్ట్రంలో లేని విధంగా గంగమ్మకు వివాహం చేయడం గమనార్హం. వివాహనంతరం అమ్మవారిని నడివీధిలో భక్తుల దర్శనార్థం ఉంచారు. బెస్తవారి ఇంటి నుంచి ఘట్టముకుండ వెళ్ళిన తర్వాత అమ్మవారి సర్వదర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఉదయాన్నే పట్టణ మహిళలు నాలుగు దిక్కుల్లోని గ్రామదేవతలకు పిండి దీపాలతో ఆరాధించారు. జాతరను నిర్వాహకులు గతంలో ఎన్నడూ లేని విధంగా ఉత్సాహంగా జరిపించారు. వీధికొక అమ్మవారి కటౌట్‌లు, ఊరంతా మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాలతో కన్నుల పండుగా జాతరను కొనసాగించారు.

## ప్రపంచ ఆరోగ్య దినోత్సవ శుభాకాంక్షలు

### మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డి



రాయచోటి ఏప్రిల్ 7, ప్రభాతవార్త

రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ వైద్యో నారాయణ హరి అన్నారు పెద్దలు ప్రాణాలను కాపాడే వైద్యులు దేవునితో సమానమని, తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా, ప్రజలకు నిస్వార్థమైన వైద్య సేవలు అందిస్తున్న వైద్యులే నిజమైన దేవుళ్ళని ఆయన వారిని కొనియాడారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యసాధనలో అహర్నిశలు శ్రమిస్తున్న డాక్టర్లు మరియు ఇతర సిబ్బందికి ప్రపంచ ఆరోగ్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. విజనరీ సీఎం చంద్రబాబు గారి సారథ్యంలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ, ప్రభుత్వ వైద్యవ్యవస్థను బలోపేతం చేస్తూ, ప్రజలందరికీ అత్యుత్తమ వైద్యసేవలు అందిస్తూ ఏపీని దేశంలోనే బెస్ట్ హెల్త్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కృషి వేస్తున్న తరుణాన ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో భాగస్వాములై, ప్రజల ప్రాణ రక్షణ, ఆరోగ్య సంరక్షణలో నిరంతరాయంగా శ్రమిస్తున్న డాక్టర్లకు, ఇతర వైద్య సిబ్బందికి ప్రపంచ ఆరోగ్య దినోత్సవ శుభాకాంక్షలు.

## జలధార కార్యక్రమంలో సాగునీటి వనరులకు మహర్దశ, ఏపీవో అంజనప్ప



తంబళ్లపల్లె ఏప్రిల్ 7 ప్రభాతవార్త ః

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలధార కార్యక్రమం ద్వారా మండలంలోని సాగునీటి వనరుల మరమ్మత్తులతో సాగునీటి వనరులకు మహర్దశ పట్టనున్నట్లు ఏపీవో అంజనప్ప తెలిపారు. మంగళవారం ఎంపీడీవో బాపూజీ పట్నాయక్, ఇరిగేషన్ ఏఈ సతీష్ ఆధ్వర్యంలో కోసువారిపల్లె, బాలిరెడ్డిగారి పల్లె పంచాయతీలలోని చెరువులు, కుంటలు, సాగునీటి వనరులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జలధార కార్యక్రమంలో మైనర్ ఇరిగేషన్ చెరువులు, కుంటలు, చెక్ డ్యాములలో జంగిల్ క్లీనింగ్, చెరువు కట్టలు, మొరవలు పటిష్టం, కాలవలు పూడికతీత, మరమ్మత్తు పనులు, నీటి సంరక్షణ పనులు చేపటడానికి సంబంధిత అధికారులకు నివేదికలు పంపనున్నట్లు ఏపీవో విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈసీ మహేష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పవన్ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్లు వేమనారాయణ, శ్రీకాంత్ రెడ్డి రైతులు పాల్గొన్నారు.

## ఈత బలే..బలే

### వేసవిలో సరదానే...సరదా



రామసముద్రం, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:

ఎండలు బాగా మండుతున్నాయి. ఎండవేడిమిని ఎలా తట్టుకోవాలో అర్థం కాని పరిస్తితి నెలకొంటోంది. చల్లటి నీటిలో ఈత ఆడాలనో ఈ చెట్టునీడనో నిద్రించాలనో, చల్లటి పానియాలు, ఆహారపదార్థాలు తినాలని అనుకొంటారు. ఎక్కువ మంది ఈత ఆడాలని భావిస్తారు. మదనపల్లె సమీపంలోని బావులు, చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు, స్విమ్మింగ్‌పూలు వద్ద చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు ఈత ఆడుతూ సేద తీరుతున్నారు. వేసవిలో యువకులు, విద్యార్థులకు ఇది ఒక సరదానే. ఎక్కడ చూసినా ఈత ఆడుతూ కనిపిస్తున్న దృశ్యాలే. మదనపల్లె సమీపంలోని నీటి బావి, స్విమ్మింగ్‌పూలు వద్ద ఈత ఆడుతూ ఆనందపడుతున్న యువకులు, విద్యార్థులను ప్రభాతవార్త కెమరాలో బందించింది.

## రామసముద్రం మండల ఎస్సై బదిలీ



రామసముద్రం ఏప్రిల్ 7 ప్రభాతవార్త

రామసముద్రం మండలంలో విధులు నిర్వహిస్తున్న ఎస్సై ఉమామహేశ్వర్ రెడ్డి బదిలీ అయ్యారు. మంగళవారం అన్నమయ్య జిల్లా ఎస్పీ దీరజ్ కునిబిల్లి ఉత్తర్వులు జారీ చేశారు.ఎస్సై ఉమామహేశ్వర్ రెడ్డి తం బళ్లపల్లె నియోజకవర్గం మొలకలచెరువు పోలీస్ స్టేషన్‌కి బదిలీ అయ్యారు. కడప పోలీస్ కార్యాలయంలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న మండలానికి హృషికేశవ రెడ్డి బదిలీ పై రానున్నారు. ఎస్సై ఉమామహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ నాకు సహాయ సహకారాలు అందించిన సిబ్బందికి, ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్న నాపై మీరు చూపిన ఆదర అభిమానాన్ని మరువనన్నారు.

## న్యాయవాది ఎల్లయ్య హత్య దర్యాప్తు వేగవంతం

### డీఎస్పీ కృష్ణమోహన్



పీలేరు,కె.వి.పల్లి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:

మండలంలోని తీతవగుంటపల్లె పంచాయతీ పరిధిలో జరిగిన న్యాయవాది హత్య ఘటనపై డి.ఎస్.పి కృష్ణమోహన్ స్పందించారు. మంగళవారం సంఘటన స్థలాన్ని స్వయంగా పరిశీలించి కేసుకు సంబంధించిన ప్రాథమిక వివరాలను మీడియాకు వెల్లడించారు. మృతుడిని పూజారి ఎల్లయ్యగా గుర్తించినట్లు తెలిపారు. గ్రామంలో ట్రాన్స్ఫార్మర్ తొలగింపు అంశంపై ఎల్లయ్యకు ముగ్గురు వ్యక్తులతో వివాదం నెలకొన్నట్లు ప్రాథమిక సమాచారం అందిందన్నారు. ఈ వివాదం ఘర్షణగా మారి, ఎల్లయ్యతో పాటు ఆయన తల్లిదండ్రులపై కూడా దాడి జరిగినట్లు వెల్లడించారు. తీవ్ర గాయాలపాలైన ఎల్లయ్యను ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందినట్లు చెప్పారు. దాడిలో గాయపడిన ఎల్లయ్య తల్లిదండ్రులు ప్రస్తుతం రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని వివరించారు. ఎల్లయ్య తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు విచారణ అనంతరం వెల్లడిస్తామని డీఎస్పీ కృష్ణమోహన్ పేర్కొన్నారు.

## శ్రీక్రిష్ణున్ని భక్తులకు బ్రాహ్మణులు క్షమాపణ చెప్పాలి

### బ్రాహ్మణ సంఘాలవి కుల దురహంకార వ్యాఖ్యలు, బాస్ వ్యవస్థాపకులు పిటిఎం శివప్రసాద్




సమావేశంలో మాట్లాడుతున్న పిటిఎం శివప్రసాద్

మదనపల్లె, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :

భారత రాజ్యాంగంలోని మతస్వేచ్ఛను, సమానత్వపు హక్కును కాలరాసిన 1950 నాటి రాష్ట్రపతి ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధమైందని బాస్ అధినేత పిటిఎం శివప్రసాద్ తెలిపారు. మదనపల్లె ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రపతి ఉత్తర్వులోని మూడో పేరాలో పేర్కొన్న విధంగా క్రైస్తవ-ఇస్లాం మతాల్లోకి మారిన షెడ్యూల్ కులాల వారికి ఎస్‌సి, ఎస్‌టి(పిఓఎ)యాక్టు వర్తించందంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై నిరసన వ్యక్తం చేస్తూ ఎమ్మార్పీఎస్ అధినేత మంద క్రిష్ణమాదిగ చేసిన వ్యాఖ్యలు సమంజసమైనవేనని తెలిపారు. బ్రాహ్మణ సంఘాల నేతలు కుల దురహంకారంతో మండిపడ్డారే తప్ప వారు అవగాహనతో మాట్లాడలేదని తెలిపారు. మందక్రిష్ణమాదిగపై అవాక్కులు పేలితే బ్రాహ్మణ సంఘాల నేతలకు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కుల వ్యవస్థ కారణంగా హిందూ మతం ప్రపంచ వ్యాప్తంగా విస్తరించ పోవడానికి లోపం ఎక్కడుందన్నారు. కులవ్యవస్థను రద్దు చేసి హిందుమతాన్ని సంస్కరించకపోతే రాబోయే కాలంలో ఇప్పుడున్నంత భారత దేశమైనా ఉంటుందన్న గ్యారంటీ లేదన్నారు. మందక్రిష్ణ మాదిగ సంబంధించిన ప్రశలకు సమాధానం చెప్పడ చేతకాక కళ్ళు తాగిన కోతుల్లా బ్రాహ్మణ సంఘాల నేతలు ప్రవర్తించారని తెలిపారు. బ్రాహ్మణ నేతలు కుల దురహంకారంతో క్రిష్ణుడు బ్రాహ్మణుల కాళ్ళు కడిగి ఆ నీరు తలపై చల్లుకున్నాడని చెప్పి అనుచిత వ్యాఖ్యలు చేసి కోట్లాది మంది భక్తుల మనోభావాలను గాయపరిచారన్నారు. విలేకర్ల సమావేశంలో శివప్రసాద్‌తో పాటు బాస్ నాయకులు నీరుగట్టి రమణ, చాట్లబయన్న, గంపల రమణ, దేగానిరమణ, సొన్నికంటి రెడ్డప్ప, వై.గంగాధర్ బి.నరసింహులు, వై.చిన్నా, మనోహర్‌రెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యం కోసం కలిసి..విజ్ఞానంతో అడుగులు వేద్దాం

### డాక్టర్ జులేక బేగం



పీలేరు ఏప్రిల్ 7 ప్రభాతవార్త;

ఆరోగ్యం కోసం కలసి పనిచేద్దాం విజ్ఞానము తో అడుగులు వేద్దాం అని చింతపర్తి పి. హెచ్. సి. వైద్యులు డాక్టర్ జులేక బేగం మరియు డిప్యూటీ హెచ్. ఈ. ఓ. మహమ్మద్ రఫీ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమం లో అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించడం మరియు ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుచు ..అపోహలను, మూఢ నమ్మకాలు, అంధ విశ్వాసం వీడి, శాస్త్రీయ, వైద్య విజ్ఞానాన్ని నమ్మడం ద్వారానే ప్రజరోగ్యం సాధ్యమని ప్రపంచ ఆరోగ్యసంస్థ పిలుపునిస్తోంది. ..మన ఆరోగ్యం మన చేతుల్లో ఉంది.మన ఆరోగ్యం కేవలం మన మీదే ఆధారపడి ఉంటుంది. కొన్ని వ్యాధులు జంతువులు, మొక్కలు మరియు మనం నివసించే కలుషిత పర్యావరణంతో వస్తాయి. .సమిష్టి కృషి:.. ప్రభుత్వాలు, ఆరోగ్య కార్యకర్తలు మరియు ప్రజలు కలిసికట్టుగా పనిచేస్తేనే ఆరోగ్య సవాళ్లను ఎదుర్కోగలం రంగు రంగుల ఆహారం, రసాయనాలతో మాగబెట్టిన మామిడి, అరటి, బొప్పాయి పండ్లు కొని తింటే ఆరోగ్యానికి హానికరం

**ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా చిన్న మార్పులు:**

ఆహారం: రసాయనాలు లేని సహజ సిద్ధమైన ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వడం. వ్యాయామం: రోజుకు కనీసం 30 నిమిషాల నడక లేదా వ్యాయామం. మానసిక ప్రశాంతత: ఒత్తిడి తగ్గించుకోవడానికి ధ్యానం లేదా నచ్చిన వ్యాపకం అలవాటు చేసుకోవడం.

**మన ఆరోగ్యం మన బాధ్యత:**

ఆరోగ్యమే మహాభాగ్యం అనే సూక్తిని మనం ఎప్పటి నుంచో వింటున్నాం. ప్రస్తుత కాలంలో మారుతున్న జీవనశైలి, కలుషిత ఆహారం, మానసిక ఒత్తిడి వల్ల అనేక కొత్త కొత్త రోగాలు వస్తున్నాయి.

**ఆరోగ్య సూత్రాన్ని జీవితకాలం ప్రజలు ఆచరించాలి.**

దేశంలో అందరికి ఆరోగ్యం అందాలంటే ఆరోగ్యం..సౌకర్యాలు కల్పన ప్రభుత్వ బాధ్యతల. ఈ కార్యక్రమం లో డాక్టర్ జులేఖ బేగం, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, పర్యవేక్షకులు బహుదీన్, భానుబి, ఎమ్. ఎల్. హెచ్. పి. లు, ఏ. ఎన్. ఎమ్ లు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలు పై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించిన ఎస్సై ఉమామహేశ్వర్ రెడ్డి



రామసముద్రం ఏప్రిల్ 7 ప్రభాతవార్త

రామసముద్రం మండలంలోని కేసీ పల్లె గ్రామపంచాయతీ ఎంబాడీ గ్రామంలో సైబర్, క్రైమ్ నేరాలు, ట్రాఫిక్ పై ఎస్సై ఉమామహేశ్వర్ రెడ్డి మంగళవారం ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై ప్రజలతో మాట్లాడుతూ క్రైమ్,, సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు జిల్లా ఎస్పీ దీరజ్ కునిబలి ఆదేశాలమేరకు గ్రామంలో పర్యటించి గ్రామస్థులతో ముచ్చటించి వివిధ నేరాలపై భద్రత ప్రమాణాలపై ప్రజలకు క్లుప్తంగా వివరించారు. సైబర్ నేరగాళ్లు ప్రజలను ఏదోవిధంగా మోసాలు చేస్తూ డబ్బులు దోచుకుంటున్నారని వీరి పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరచిత వ్యక్తులు కాల్ చేసి మీకు ఓ టి పి వస్తుందని మీరు చెప్పాలని అడుగుతారని మీరు ఓటీపీ చెప్పకండన్నారు.భూసమస్యలపై గొడవలు పడకండి ఏవైనా భూ సమస్యలు ఉంటే రెవిన్యూ సిబ్బంది మాతో సంప్రదించండన్నారు. ఇంటిలో బంగారం ఎక్కువగా ఉంచుకోకండి బంగారం విపరీతంగా పెరుగుపోవడం వల్ల దొంగ తనాలు జరిగేందుకు ఆస్కారం ఉంటుందని, ప్రతి గ్రామ నడిబొడ్డున, ప్రతిఇంటిలో సీసీ కెమెరాలు పెట్టుకోవాలని, మీగ్రామంలో ఎవ్వరైనా అపరచివ్యక్తులు సంచారం చేస్తే అటువంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని,వారిపై అనుమానం వస్తే పోలీసుల కు తెలియపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఉమామహేశ్వర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది, ప్రజలు హాజరయ్యారు.

## సోషల్‌మీడియా వాడకంలో వైఎస్ఆర్ సిపి ముందుండాలి

### నియోజకవర్గ సమన్వయ కర్త నిస్సార్‌అహ్మద్



సమావేశంలో మాట్లాడుతున్న నిస్సార్‌అహ్మద్

మదనపల్లె, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :

వైకాపా నాయకులు, కార్యకర్తలు అందరూ సోషల్‌మీడియాను వాడకంలో ముందుండాలని మదనపల్లె వైకాపా నియోజకవర్గ సమన్వ యకర్త నిస్సారఅహ్మద్ పిలుపునిచ్చారు. స్థానిక అవెన్యూరోడ్డులోని వైఎస్ఆర్ కార్యాలయంలో మంగళవారం ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ మహిళా యువజన,ఐటి విభాగాల ప్రతినిధులు, ముఖ్యనాయకుల సమా వేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా నియోజకవర్గ పరిశీలకులు అనూషరెడ్డి పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని దీనికి మండల, గ్రామ, నియోజకవర్గ స్థాయి కమిటీ సభ్యులు సహకారం ఇవ్వాలని తెలిపారు. గ్రామ పంచాయితీల్లో కష్టపడే ప్రతి నాయకుడికి జగన్ 2.0లో పూర్తి స్తాయిలో గుర్తింపు ఉంటుందని భోరసా ఇచ్చారు. గ్రామ, మండల, మున్సిపల్ వార్డు, సంస్థాగత కమిటీల డిజిటలైజేషన్ త్వరగా పూర్తి చేయాలని పార్టీ గుర్తింపు కార్డులు అందజేయాలని సూచించారు. త్రపి ఒక్కరికి గుర్తింపుకార్డులు అందజేయాలని సూచించారు. వైఎస్ఆర్ సిపి సోషల్ మీడియా, నాయకులు వైఫల్యం చెందడం ద్వారా అధికారానికి దూరంగా అయ్యామని విషయం ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. సోషల్ మీడియా వేదికగా అంతా మేము చేస్తున్నామని ఊదరగొట్టుకోవడం పరిపాటిగా కూటమి ప్రభుత్వానికి మారిందని తెలిపారు. నవరత్నాల ద్వారా చేసిన మేలు అభివృద్ధి సంక్షేమ పథకాల ద్వారా లబ్దిదారులకు డైరెక్టుగా లబ్ది మరోసారి ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో పరిశీలకురాలు అనూషారెడ్డి, విఎస్.రెడ్డి, డి.హర్షవర్ధన్‌రెడ్డి, యాసిన్, చిప్పిలి మల్లికార్జునరెడ్డి, ఆవుల సోమశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శారదారెడ్డి, నాగమణి, రవితేజ, వివిధ మండలాల నాయకులు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

### అవగాహనతో వ్యాధుల నియంత్రణ సాధ్యం

### వైద్యురాలు శ్రీగిరీష



పీలేరు ఏప్రిల్ 7 ప్రభాతవార్త:

ఆరోగ్యంగా ఉండాలంటే మనం వ్యాధుల నియంత్రణలో అవగాహన అవసరమని తలుపుల ప్రదానవైద్యాధికారులు శ్రీగిరీష అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శ్రీగిరీష వారి బృందంతో కలిసి తలపులలో ర్యాలీ మరియు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఒకప్పుడు వ్యాధుల నిలయమైన భారత్, నేడు వ్యాధుల నియంత్రణలో,డిజిటల్ హెల్త్ రంగములో అగ్రగామిగా నిలిచిందని, ఆయుస్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ప్రతి ఒక్కడికి ఒక "అభా" ఐడి, పేదలకు అండగానిలిచే ఆయుస్మాన్ ఆరోగ్యమందిరాలు, ఇందులో అధిక రక్తపోటు, డయాబెటిక్ వ్యాధుల నిర్ధారణలో వాటి అదుపులో మరియు టిబి రహిత భారత్ లక్ష్యాల్లో 25 శాతం మరణాల తగ్గింపులో ఒక నిశ్శబ్ద విప్లవాన్ని సృష్టించిందని డాక్టర్ శ్రీగిరీష తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ హెచ్ఇఓ కొండయ్య, పిహెచ్ యన్,కుసుమ,ఏయన్ యం లు,సిహెచ్ఓ లు మరియు ఆశా కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అవగాహనతో వ్యాధుల నియంత్రణ సాధ్యం

### వైద్యురాలు శ్రీ గిరీషా



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పీలేరు ఏప్రిల్ 7 ప్రభాతవార్త:

రేపటి తరం ఆరోగ్యంగా ఉండాలంటే మనం వ్యాధుల నియంత్రణలో అవగాహన అవసరమని తలుపుల ప్రదానవైద్యాధికారులు శ్రీగిరీష అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శ్రీగిరీష వారి బృందంతో కలిసి తలపులలో ర్యాలీ మరియు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఒకప్పుడు వ్యాధుల నిలయమైన భారత్, నేడు వ్యాధుల నియంత్రణ లో డిజిటల్ హెల్త్ రంగములో అగ్రగామిగా నిలిచిందని, ఆయుస్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ప్రతి ఒక్కడికి ఒక "అభా" ఐడి, పేదలకు అండగానిలిచే ఆయుస్మాన్ ఆరోగ్యమందిరాలు, ఇందులో అధిక రక్తపోటు, డయాబెటిక్ వ్యాధుల నిర్ధారణలో వాటి అదుపులో మరియు టిబి రహిత భారత్ లక్ష్యాల్లో 25 శాతం మరణాల తగ్గింపులో ఒక నిశ్శబ్ద విప్లవాన్ని సృష్టించిందని డాక్టర్ శ్రీగిరీష తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ హెచ్ఇఓ కొండయ్య, పిహెచ్ యన్,కుసుమ,ఏయన్ యంలు,సిహెచ్ఓలు ఆశా కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## దళితులకు కూటమి ప్రభుత్వంలో రక్షణ కరువు

### వైసీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి వద్దే హరి



పీలేరు ఏప్రిల్ 7 ప్రభాతవార్త:

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వంలో ఎస్సీ ఎస్టీ కులాల వారికి రక్షణ కరువవుతుందని రాష్ట్ర వైసీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి వడ్డీ హరి అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం దళితులైన నాయకులను ఎమ్మెల్యేలను సైతం మాజీ ఎమ్మెల్యేలను మాజీ మంత్రులను అక్రమ కేసులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని అదేవిధంగా తాటిపర్తి దళిత ఎమ్మెల్యే చంద్రశేఖర రావు పై దాడి జరగటం అమానుషమని దళితుల మహిళలపై కొంతమంది అగ్రవర్ణాల వారు కొట్టడమే కాకుండా బూతు పురాణముతో వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలుస్తుందని ఆయన అన్నారు కోటమ్మ ప్రభుత్వంలోని వివిధ రకాల పదవులలో ఉన్న కొంతమంది చేస్తున్న రాశికాలను పక్కనపెట్టి అమాయకుల పై దాడి చేయడం ఎంతవరకు సమంజసమని హరి అన్నారు.

## భక్తులందరూ అన్నప్రసాదం స్వీకరించవలనని మనవి



రాయచోటి ఏప్రిల్ 7 ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లా రాయ చోటి టౌన్ యందు వెలసిన శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవస్థానం నందు ప్రతి రోజు భక్తుల సౌకర్యార్థం అన్న ప్రసాదం నిర్వహిస్తున్నాము కావున భక్తులందరూ అన్నప్రసాదం స్వీకరించవలనని భక్తులకి ఆలయ చైర్మన్ తిరుమల మనోజ్ కుమార్ మరియు ఆలయ కార్యనిర్వాహణాధికారి డి.వి రమణారెడ్డి తెలియజేశారు.

## చికిత్సకు వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి మృతి



మదనపల్లెక్రైమ్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త.

చికిత్సకు వచ్చిన ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం మదనపల్లి ప్రభుత్వాసుపత్రిలో జరిగింది. పోలీసులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఇతనికి మతి స్థిమితం లేకపోవడంతో రోడ్డులో ఉంటూ ఎవరైనా ఏదయిన పని చెబితే చేసి వారు ఇచ్చే చిల్లరతో తిని రోడ్డుపైనే నిద్దర పోయేవాడు. స్థానికులకు అందరికి సూరి పేరుతో సుపరచితుడు. సూరికీ ఆరోగ్యం బాగ లేక పోవడంతో రింగు రోడ్డులో ఉంటున్న సిద్దేశ్వర, రమణారెడ్డిలు సూరిని తీసుకు వచ్చి వారం రోజుల క్రితం స్థానిక జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతునికి బంధువులు ఎవరైనా ఉంటే మృతదేహం ను తీసుకెళ్లాని రెండవ పట్టణ పోలీసులు తెలిపారు. ఎవరు రాకపోతే మృతదేహాన్ని మునిసిపాలిటీకి అప్పగిస్తామని సీఐ మహ్మద్ రఫి తెలిపారు.

## కరెంటోళ్ల జన బాట" కార్యక్రమం



**నందలూరు, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:**
వినియోగదారుల విద్యుత్ సమస్యలను వారి ఇంటి వద్ద నుంచే తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు ఏపీఎస్పీడీసీఎల్ చేపట్టిన కరెంటోళ్ల జన బాట" కార్యక్రమం ప్రజలకు ఉపయోగకరంగా నిలుస్తోంది. కార్యక్రమం భాగంగా అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ విద్యుత్ సరఫరా వ్యవస్థలను పరిశీలించి, లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, కనెక్షన్లు, లోడ్ పరిస్థితులను తనిఖీ చేస్తున్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ముందస్తు చర్యలు తీసుకుని విద్యుత్ అంతరాయాలు లేకుండా చర్యలు చేపడుతున్నారు. అధికారులు ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడంపై దృష్టి సారిస్తున్నారు. అలాగే పీఎం సూర్య ఘర్ పథకం, విద్యుత్ భద్రతా నియమాలపై అవగాహన కల్పిస్తున్నారు. కార్యక్రమం ద్వారా ఆఖరి వినియోగదారుని వరకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సేవలు అందించడమే లక్ష్యంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

## వడదెబ్బ పట్ల ప్రజలు జాగ్రత్త వహించండి

**వైద్యాధికారి రంగలక్ష్మి**



**సిద్ధవటం, ఏప్రిల్ 7 ప్రభాతవార్త**
అధిక ఉష్ణోగ్రత వల్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని పి కొత్తపల్లి వైద్యాధికారి రంగలక్ష్మి తెలిపారు మండల కేంద్రమైన సిద్ధవటం లోని బిసి బాలుర వసతి గృహం ప్రాంగణంలో మంగళవారం ఆశా డే సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతల వల్ల ప్రతి ఒక్కరు జాగ్రత్త వహించాలని సూచించారు. వడదెబ్బ నివారణకు త్రాగునీరు, మజ్జిగ తప్పనిసరిగా తీసుకోవాలని బయటికి వెళ్ళేటప్పుడు టోపీ, కళ్ళజోడు, శరీరానికి ఎండ తగలకుండా తగిన వస్త్రాలను తప్పనిసరిగా ధరించాలని విరోచనాలు, నీరసం, అలసట ఉన్న రోగులు అందుబాటులో ఉన్న ప్రభుత్వ వైద్యశాలలో వైద్యుని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ మోలాలి, హెల్త్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య, ఆరోగ్య కార్యకర్తలు, అంజన శారద, వాసవి, వైద్య సిబ్బంది ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## గోల్డ్ మెడల్ సాధించిన కావేరి



**వేంపల్లె:ఏప్రిల్ 07 ప్రభాతవార్త**
వేంపల్లి మండలంలోని మారుమూల గ్రామమైన గిడ్డంగివారిపల్లె గ్రామానికి చెందిన గోర్ల కావేరి యూనివర్సిటీ గోల్డ్ మెడల్ సాధించడం పట్ల మండల జడ్పిటిసి మాచిరెడ్డి రవి కుమార్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గిడ్డంగివారిపల్లె గ్రామానికి చెందిన గోర్ల కావేరి పులివెందుల జేఎన్ టియుఏ లో బీటెక్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ 2021, 25 పూర్తి చేసింది. ఇందులో గోర్ల కావేరి మొదటి ర్యాంకు సాధించింది. దీంతో ఆమె గోల్డ్ మెడల్ కు అర్హత పొందింది . అనంతపురంలో జేఎన్ టియుఏ యూనివర్సిటీ లో జరిగిన 15 వ కాన్వికేషన్ కార్యక్రమంలో గోర్ల కావేరి గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకుంది. అనంతరం గోర్ల కావేరి మాట్లాడుతూ పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని, నాకు గోల్డ్ మెడల్ రావడం సంతోషంగా ఉందని తెలిపారు. సివిల్ సర్వీస్ లో ఐఎఎస్ సాధించడమే తన లక్ష్మమని గోర్ల కావేరి తెలిపారు. ఆమె గోల్డ్ మెడల్ సాధించడం పట్ల గిడ్డంగివారిపల్లె గ్రామస్తుడయిన మండల జడ్పిటిసి మాచిరెడ్డి రవి కుమార్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. మా ఊరి అమ్మాయి గోల్డ్ మెడల్ సాధించడం గిడ్డంగివారిపల్లె గ్రామానికే గర్వకారణమన్నారు.

# గనులు, క్వారీల నిర్వహణపై దృష్టి సారించాలి : కలెక్టర్

**కడప, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :**
జిల్లాలో గనులు, క్వారీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి.. నిబంధనలను అతిక్రమించే వాటిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మైనింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో జిల్లాలో మైనింగ్ క్వారీల నిర్వహణ, ప్రధాన ఖనిజ బ్లాకుల కార్యాచరణ, భూ షెడ్యూల్/వర్గీకరణ/కడాస్ట్రల్ ప్రత్యేకతలతో పాటు రెవెన్యూ వివిధల సమస్యలు తదితర అంశాలపై జేసీ డా. నిధి మీనా, రాజంపేట సబ్ కలెక్టర్ భావన లతో కలిసి సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి జిల్లా స్థాయి స్క్రీనింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విరివిగా ఉన్న ఖనిజ నిక్షేపాలను ఆర్థిక వనరుగా సద్వినియోగం చేసుకోవడంలో ప్రత్యేక దృష్టి సారించాల్సిన బాధ్యత మైనింగ్ అధికారులపై ఉందన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఎన్ని గనులు నిర్వహణలో ఉన్నాయి..? నిర్వహణలో ఉన్న అన్ని క్వారీలకు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా..? నిబంధనలకు లోబడి నిర్వహణలో ఉన్నాయా..? అన్ని రకాల భద్రతా ప్రమాణాలను పటిస్తున్నారా..? సామాజిక బాధ్యత, వార్షిక రాబడి, ఆదాయం తదితర అంశాలపై సమీక్షించి పలు ఆదేశాలు జారీ చేశారు. మైన్స్, క్వారీలకు సంబంధించి.. పెండింగ్ లో ఉన్న వాటికి టెండర్ నోటిఫికేషన్ ఇవ్వాలని, రెవెన్యూ, పర్యావరణ, అటవీ సంబంధిత పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కారంకు చర్యలు చేపట్టాలన్నారు.



ఆడిటింగ్ రిపోర్ట్ కూడా విధిగా అందజేయాలన్నారు. స్క్రీనింగ్ కమిటీ సమావేశంలో అందులో భాగంగా జిల్లాలోని గనుల నిర్వహణ పనితీరుపై సమీక్షించి.. కొత్తగా గుర్తించిన 6 ఇసుక రీచులకు నోటిఫికేషన్ జారీచేసేందుకు జిల్లా కలెక్టర్ ఆమోదం తెలిపారు. దీంతో జిల్లాలోని 6 కొత్త ఇసుక రీచుల నిర్వహణకు టెండర్లను ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కడప, బద్వేలు, పులివెందుల ఆర్డీవోలు మురళి, చంద్ర మోహన్, చిన్నయ్య, "కుడా" సెక్రెటరీ శిరీష, మైన్స్ డిడి సుబ్రమణ్యం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ సుధ, మైన్స్, పర్యావరణ, అటవీ, విజిలెన్స్, రెవెన్యూ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సామాజిక సమరత సమ్మేళనం

**ప్రొద్దుటూరు అర్బన్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త**
ప్రొద్దుటూరులోని దేవాంగ కళ్యాణమండపంలో మంగళవారం జరిగిన సామాజిక సమరత సమ్మేళన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో విశ్వహిందూ పరిషత్ నాయకులు వివిధ హిందూ సంఘాల నాయకులు హాజరై కార్యక్రమాన్ని పెద్ద సంఖ్యలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విశ్వహిందూ పరిషత్ అఖిలభారత సహకార దర్శి వినాయకరావు దేశ్ పాండే మాట్లాడుతూ సమాజంలో కులమత బేధాలు లేకుండా భారతీయులందరూ కలిసేందుకు విశ్వహిందూ పరిషత్ పనిచేస్తుందన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జీవితంలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారని అయినను వారు హిందూమతంలో అంతర్భాగమైన బౌద్ధ మతంలో ఉన్నారన్నారు. వారు పరమతలైన ముస్లిం, క్రిస్టియన్ మతాల నుంచి ఎన్నో రకాలైన ప్రలోభాలను వచ్చినప్పటికీ వారు ఆ మతాలలోకి వెళ్లలేదని, అలాగే బాబు జాగ్జీవన్ రావు 53 సంవత్సరాల తన రాజకీయ జీవితంలో ఎన్నో పరమతాల నుంచి



ఒత్తిడి వచ్చినప్పటికీ ప్రలోభాలను అధిగమించి హిందూమతంలోనే తన జీవితకాలం గడిపారని అటువంటి హిందూ మతం చాలా గొప్పదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రాంత కార్యదర్శి వర కోటేశ్వరరావు, ప్రాంత ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, ప్రాంత సంఘటన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అధ్యక్షులుచీతిరాల నాగార్జున రావు, బద్వేల్ నాగమణి రెడ్డి, మారెళ్ళ మల్లికార్జునరావు, అనేక మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థుల మంచి భవిష్యత్తుకు సహాయం

**రాజుపాళెం, ఏప్రిల్ 07, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని కొర్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంచి విద్య నేర్చుకొనుటకు ఉపయోగపడే వస్తు సామాగ్రి కిట్లు, పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్, దానికి కావాల్సిన టేబుల్, ప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్ ను ఇన్ఫినిటీ పిన్ కార్ప్ సొల్యూషన్స్ కంపెనీ వారు మంగళవారం పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడు సురేష్ బాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించి ఆ కంపెనీ ప్రతినిధులు రీజనల్ మేనేజర్ చాంద్ బాషా వారి యూనిట్ అధికారులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ విద్యార్థుల మంచి భవిష్యత్తుకు విద్య ఎంత అవసరమో, విద్యార్థులు మంచి విద్య నేర్చుకొనుటకు కావలసిన వస్తు సామాగ్రి ఇన్ఫినిటీ కంపెనీ వారు మన పాఠశాలకు అందించి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నందుకు ఆ కంపెనీ వారికి కృతజ్ఞతలు తెలిపారు. రీజనల్ మేనేజర్ చాంద్ బాషా మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్య యొక్క ఆవశ్యకత, ఉన్నత భవిష్యత్తులకు ఎలా దోహదపడుతుందో వివరిస్తూ కన్న తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చుటకు ప్రతి విద్యార్థి గొప్ప చదువులు చదివి ఉన్నత స్థాయిలో నిలవాలని వారి కోసం మా చిన్న కానుకను మా కంపెనీ తరఫున అందిస్తున్నందుకు ఎం



తో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమను ఇక్కడ నిర్వహించుటకు ఈ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి ఎస్. ఓబులేసు మా కంపెనీ యందు బ్రాంచ్ మేనేజర్‌గా పని చేస్తూ పాఠశాలకు, మా గ్రామ విద్యార్థులకు సహకారం చేయాలని కోరిక మేరకే మేము ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏరియా మేనేజర్లు కృష్ణ, శ్రీనివాసులు రెడ్డి, మున్వర్ భాష, బ్రాంచ్ మేనేజర్ ఓబులేసు, పాఠశాల అధ్యాపక బృందం, ఇన్ఫినిటీ కంపెనీ సిబ్బంది అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మెయిన్ రోడ్డు గుంతలమయం

**కలసపాడు, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:**
మండలంలోని పోరుమామిళ్ల టు గిద్దలూరు రోడ్డు కలసపాడులోని టౌన్ సర్కిల్‌లో అంత గుంతల మయంతో ఉండదని ప్రజలు, వాహనదారులు గుసగుసలాడుతున్నారు. నిత్యం వాహనాలు ఆ రోడ్డు వెంబడి బానే ఉంటాయి, కానీ ఇటీవల కొమరోలు రోడ్డు పనులు జరుగుతున్నందువలన ప్రతి వాహనాలు గిద్దలూరు వచ్చి కలసపాడు మీదుగా పోవాల్సి ఉంది. ఆ రోడ్డులో కలసపాడు దగ్గర పురాతనమైన వంతెన ఉన్నది. ఆ బ్రిడ్జి ఎప్పుడు వాహన తాకిడికి దెబ్బతింటున్నానని కలసపాడు ప్రజలు బిక్కు బిక్కుమంటున్నారు. నిన్న కలసపాడు గిద్దలూరు రోడ్ ఎక్కువ గుంతలు పడడంతో వాహనదారులు కిందపడి దెబ్బలతో వెళ్ళిపోతున్నారు. కానీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఏమైనా జరుగుతే గాని పట్టించుకుంటారేమోనని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా గుంతలలో రోడ్డు లో లారీలు, ఆటోలు, ట్రాక్టర్లు భయపడాల్సి వస్తుందని వాహనదారులు గుసగుసలాడుతున్నారు. తాత్కాలికమైన పనులు చేయాలని అధికారులను మండల ప్రజలు, వాహనదారులు వేడుకుంటున్నారు. అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టే ఉన్నారు.



## వ్యవసాయ రంగంపై రైతులకు శిక్షణ



**దువ్వూరు, ఏప్రిల్ 07, ప్రభాతవార్త:**
వ్యవసాయ రంగంలో వాతావరణ పరిస్థితుల ప్రభావం మరియు ప్రతికూల పరిస్థితుల గురించి రైతులకు జిల్లా వనరుల కేంద్రం వారి సౌజన్యములో డిఆర్సీ వ్యవసాయ అధికారి స్వాతి శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మండలంలోని పెద్ద జొన్నవరం గ్రామంలోని రైతు సేవ కేంద్రంలో శిక్షణలో ఆమె మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులను అనుకూలించి జిప్సం సాగు చేసే మంచి దిగుబడులు సాధించవచ్చు అన్నారు. వాతావరణ మార్పుల వల్ల కలిగే ప్రతికూల పరిస్థితులను తట్టుకునే విధంగా సాగు పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. రాబోయే ఖరీఫ్ సీజన్లో వర్షాలు తక్కువగా వస్తాయని వాతావరణ శాఖ శాస్త్రవేత్తలు తెలియజేస్తున్నారని అందుకు తగ్గట్టుగా పంటలను పండించుకోవాలి అన్నారు. పంట ఎండిపోయినప్పుడు యూరియా, పొటాషియం నైట్రేట్ పిచికారి చేస్తే బెట్ట నుంచి తట్టుకుంటుంది అన్నారు. ప్రతి రైతు తన పొలంలోని మట్టిని తీసుకొని వచ్చి భూసార పరీక్షలు చేసుకుంటే అందువల్ల వచ్చే లాభాలు అధికంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కాంతమ్మ, రామ్ చరణ్, మనోజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యను తొలగించండి

**బద్వేల్ రూరల్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త**



బద్వేలు మండలం బయనపల్లి హరిజనవాడ ప్రజలు విద్యుత్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత కొంత కాలంగా, ముఖ్యంగా గత సంవత్సరం నుంచి, గ్రామంలో విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతూ రాహంగ్రి సమయాల్లో పూర్తిగా అంధకారంలో గడపాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం2 చేస్తున్నారు. విద్యుత్ లేకపోవడంతో చిన్నపిల్లలు చదువులు సాగించలేకపోవడం, వృద్ధులు ఇబ్బందులు పడడం, అలాగే రోజువారీ పనులు కూడా అంతరాయం కలుగుతున్నాయని వారు చెబుతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించుకున్నప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేకపోవడం పట్ల గ్రామ ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ లైన్లలో లోపాలు, ట్రాన్స్‌ఫార్మర్ సమస్యలు ఉన్నాయని అనుమానం వ్యక్తం చేస్తూ, వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. అందువల్ల, పై అధికారులు తక్షణమే చొరవ తీసుకుని బనపల్లి హరిజనవాడలో విద్యుత్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇకపై ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా నిరంతర విద్యుత్ సరఫరా కల్పించాలని వారు కోరుతున్నారు.

## వైభవంగా శ్రీ ధరణి సీతారామస్వామి జయంతి

**రాజుపాళెం, ఏప్రిల్ 07, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని కొర్రపాడు గ్రామంలో గల శ్రీ ధరణి సీతారామస్వామికి శ్రీ దత్తాత్రేయ స్వాముల వారి గురు కృపతో జ్ఞానోద యం కలిగిన ప్రదేశంలో జయంతి వేడుకలను వైభవంగా భక్తిశ్రద్ధలతో మంగళవారం జరుపుకున్నారు. శ్రీ ధరణి సీతారామస్వామి మహన్యాస పూర్వకపాదుక పూజ, స్వామి వారికి శ్రీ దత్తాత్రేయ స్వాముల వారు బీజా క్షరములు లిఖించి, జ్ఞానోదయం కలిగించిన ప్రదేశంలో గల పెద్ద బండరాయికి క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. శ్రీ ధర్మే సీతారామస్వామికి చిన్నతనంలో జ్ఞానోదయం కలిగిన ప్రదేశం కనుక గొప్ప మహిమ గల ప్రదేశంగా భావిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించడం విశేషం. స్వామి వారి జయంతి ఉత్సవంలో కర్నూలు, నంద్యాల, కడప, అ నంతపురం జిల్లాలో గల స్వామి వారి భక్తులు శిష్య బృందం వారు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వ హించారు.

## పన్ను వసూలులో సామాన్యులను పీడిస్తున్న అధికారులు

**మైదుకూరు, ఏప్రిల్ 07, ప్రభాతవార్త:**
పన్ను వసూలులో లక్షల బకాయిలు ఉన్న సంపన్నులను వదిలేసి సామాన్యులను పీడిస్తున్న అధికారుల వైఖరిని నిరసిస్తూ అఖిలపక్ష పార్టీ ప్రజాసంఘాలు తలపెట్టిన జిల్లా వ్యాప్త ఆందోళనలో భాగంగా మంగళవారం మైదుకూరు మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ షాజహాన్‌కి సిపిఐ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరాములు ఏరియా కార్యదర్శి షావలి మాట్లాడుతూ స్థానిక సంస్థలు స్వయం పరిపాలన దిశగా నిధులు, విధులు చట్టబద్ధత కల్పిస్తూ రాజ్యాంగం ఇచ్చిన హక్కును అధికారులు అధికార పార్టీ నేతలు ఉల్లంఘిస్తున్నారని వారు ఆరోపించారు. మైదుకూరు మున్సిపాలిటీలో లక్షల బకాయిలు ఉన్న సంపన్న వర్గాల జోలికి పోకుండా సామాన్యులను పీడించి కుళాయి కనెక్షన్ కట్ చేస్తామంటూ, ఇంటికి తాళాలు వేస్తామంటూ ఫైనాన్స్ కంపెనీల కంటే అధ్వానంగా వ్యాపార సంస్థలను తలదన్నే విధంగా మున్సిపల్ అధికారులు వ్యవహరించారన్నారు. ఇంత ఒత్తిడి చేసి వసువులైన జనరల్ ఫండ్ ను తిరిగి జనం కోసం మౌలిక సదుపాయాలైన రోడ్లు కాలువలు వీధిలైట్లు త్రాగునీటి వసతి కల్పనకు ఖర్చు చేయడంలో శ్రద్ధ పెట్టడం లేదన్నారు. పన్ను వసూళ్లలో సంపన్న వర్గాన్ని వదిలి పేద ప్రజలను పీడిస్తే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి సుబ్బరాయుడు ఏరియా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్ నాయకులు శ్రీను, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



# మీడియా ఎండిపై కేసు నమోదు చేయాలి

**మీడియా ప్రసారాలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల పిర్యాదు**

**పులివెందుల, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :**
మీడియా చానల్‌లో ప్రసారమైన వార్తలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా ఉన్నాయని ఆరోపిస్తూ, ఆ పార్టీ నాయకులు పులివెందులలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో జరిగిన కార్యక్రమం లో పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి సర్కిల్ ఇన్స్పెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వైసీపీ నాయకుల మనోభావాలు దెబ్బతీసేలా అసభ్యకర రీతిలో సభ్య సమాజం తల దించుకునే విధంగా ప్రసారం చేసిన కథనాలకు నిరసనగా మీడియా ఎండీపై మరియు ప్రతినిధులపై కేసు నమోదు చేయాలని వైసీపీ నాయకులు పులివెందుల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చానల్ లో ప్రసారమైన వార్తలు అసత్యాలు మరియు దుష్ప్రచారానికి దారితీస్తున్నాయన్నారు. ఇలాంటి తప్పుడు వార్తల వల్ల పార్టీ ప్రతిష్టకు నష్టం కలుగుతోందని, ప్రజల్లో అపోహలు ఏర్పడుతున్నా యని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. వినతి పత్రంలో భారతీయ శిక్షాస్మృతి (ఐపిసి) సెక్షన్ 499, 500 (మాన నష్టం), 153 ఏ (వర్గాల మధ్య విద్వేషం), అలాగే ఐటీ చట్టం 2000 ప్రకారం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ ఘటనపై స్పందించిన పోలీసులు ఫిర్యాదును స్వీకరించి, విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటా మని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ , మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ హఫీజ్, రాష్ట్ర సివిల్ సప్లై మాజీ డైరెక్టర్ హాలు గంగాధర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు పార్లపల్లి కిషోర్, కోడి రమణ , మాజీ కో ఆప్షన్ నెంబర్ చంద్రమౌళి, నూరు బాషా సంఘం అధ్యక్షుడు రసూల్ పాల్గొన్నారు.



పిర్యాదు చేస్తున్న వైసీపీ నేతలు

## ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ






**బద్వేలు అర్బన్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**
బద్వేల్ మండలం తొట్టిగారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ర్యాలీ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి. రాజేష్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహిస్తూ ప్రజల్లో ఆరోగ్యంపై చైతన్యం కల్పిస్తున్నామని తెలిపారు. సమతుల ఆహారం, పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యకరమైన జీవితం గడపవచ్చని సూచించారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంగయ్, సబ్ యూనిట్ ఆఫీసర్ బ్రహ్మాజీలు వేసవిలో వడదెబ్బ నివారణ, సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పోస్టర్లు, పాంప్లెట్ల ద్వారా అవగాహన కల్పించాలని తెలిపారు. డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ శంభు ప్రసాద్ లెప్రసీ గుర్తింపు కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రావతి, హెల్త్ అసిస్టెంట్ జనార్దన్ రావు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## గుర్తింపు పొందిన కళాశాలలోనే ప్రవేశాలు తీసుకోవాలి

**ఎడ్యుకేషన్ ఏప్రిల్ 7 ప్రభాతవార్త :**
కడప జిల్లా విద్యార్థులు, తల్లిదండ్రులు ఇంటర్మీడియట్ కోర్సులకు తప్పనిసరిగా బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ గుర్తింపు పొందిన జూనియర్ కళాశాలల్లోనే ప్రవేశాలు పొందాలని అధికారులు సూచించారు. స్టడీ సెంటర్లు, ట్యుటోరియల్ సెంటర్లు, కోచింగ్ సెంటర్లు వంటి సంస్థలు ఇంటర్మీడియట్ బోర్డు పరిధిలోకి రావని, అందువల్ల ఇటువంటి సంస్థల్లో విద్యార్థులను చేర్పించకూడదని హెచ్చరించారు. అనుమతిలేని కళాశాలలు లేదా కోచింగ్ సెంటర్లలో చేరితే ఆర్ఐఓ కార్యాలయం లేదా ఇంటర్మీడియట్ బోర్డు ఎలాంటి బాధ్యత వహించదని తెలిపారు. కాబట్టి విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా గుర్తింపు పొందిన జూనియర్ కళాశాలల్లోనే అడ్మిషన్లు తీసుకోవాలని ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి టి.ఎన్.వి. వెంకటేశ్వర్లు తెలిపారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

**ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:**



రామేశ్వరంలోని తొగటవీర క్షత్రియ కళ్యాణ మండపం వద్ద ఉన్న కాలువలో పడి గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం మృతి చెందినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. మృతుడి బంధువులు, సంబంధీకులు ఎవరైనా గుర్తించి తమను సంప్రదించాలని తెలిపారు.

## విధ్యుత్ వైర్లను తగులుకొని విద్యార్థి మృతి



**బ్రహ్మంగారిమఠం ఏప్రిల్ 07 ప్రభాతవార్త**
మండలం తోట్లపల్లి గ్రామం వద్ద ఉన్న శ్రీ అచలానంద ఆశ్రమం వద్ద 33 లెవెన్ కేవీ విద్యుత్ వైర్ తక్కువ ఎత్తులో ఉన్న కారణంగా మృతి చెందిన కార్తీక్ సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్ మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్ మండల కమిటీ సభ్యులు సానా గోవిందస్వామి, రెబ్బ నరసింహలు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎద్దు రాహుల్ బృందం సందర్శించి మృతదేహానికి నివాళి అర్పించి కార్తీక్ తల్లిదండ్రులకు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా, దర్శి మండలం బొట్లపాలెం గ్రామానికి చెందిన కార్తీక్ అచలానంద ఆశ్రమంలో ఉంటూ బ్రహ్మంగారి మఠంలో ఉన్న ప్రైవేట్ హై స్కూల్ నందు 8వ తరగతి చదువుకుంటున్నాడని సోమవారం రాత్రి స్నానానికి వెళ్లిన కార్తీక్ క్రిందకు వేలాడుతున్న 33 లెవెన్ కె.వి వైర్లను తగులుకొని మరణించడం దురదృష్టకరమని భవిష్యత్తులో ఉన్నత చదువులు చదువుకొని తన కుటుంబానికి అండగా నిలవాల్సిన విద్యార్థి బలి కావడం బాధాకరమని వారి ఆందోళన వ్యక్తం చేశారు.